# సాక్ష్యం

గంధం యాజ్ఞవల్క్య శర్మ


*అమాయకత్వం బాల్యానికే పరిమితమై ఉంటుంది. చాపల్యమూ ఆలాంటిదే. సహజమైన ఆ మానసిక దౌర్బల్యాలకు లోబడి చేసే పనులకు పరిణతి చెందిన మానవుడు బాధ్యత వహించాలంటే.... కఠోరమైన సమస్య కాదా?*

సాయంత్రం అయిదు గంటలయింది. వరంగా వుండటం మూలాన ఎక్కడకు కదలకుండా గదిలోనే వుండిపోయాను. జానకి అక్కయ్య కూతురు, రిక్షాలో వచ్చింది. ఆశ్చర్యపోయాను. ఒకే వూళ్లో వుంటున్నా జానకి అక్కయ్యే నాగదికి వచ్చి ఎరుగదు.

వస్తూనే బిక్కపోయిన మోముతో 'అమ్మకు మూడు దినాలనుండి జ్వరం. ఈ రోజు ఎక్కువగా వుంది. పిచ్చి పిచ్చి మాటలుమాట్లాడుతోంది' అంటూ చెప్పింది. వెంటనే బయలు దేరాను.

వూరికి చిట్ట చివర, బ్లాక్ డెవలప్‌మెంట్ వారి క్వార్టర్సు కూడ దాటాక ఉన్న పూరిపాక చేరేపాటికి చీకటి పడింది.

జానకి అక్కయ్య మంచంలో పడుకొని వుంది—ఎటో దీక్షగా చూస్తూ. ప్రక్కింటి యిల్లాలెవరో అక్కడ వుంది; ఆమె చెప్పింది—అంత క్రితమే మన స్పృహలో కొచ్చిందని. నన్ను



చూస్తూనే, మౌనంగా కన్నీరు కార్చింది జానకి అక్కయ్య.

'ఛ! అదేమిటి, ధైర్యంగా వుండాలి' అంటూ శరీరం తాకి చూచాను. జ్వరం కాగిపోతోంది. డాక్టరుకోసం పంపుతాను, అంటూ నా వెంట వచ్చిన జవానును పంపపోయాను. వద్దని వారించింది.

'అదే' మన్నాను.

''ఇలారా! మురారీ'' అంది. దగ్గరగా వెళ్లాను. ఏదో చెప్పటానికి ప్రయత్నించింది. కాని అంతలోనే తెర వచ్చినట్లు మైకం తెరలోకి జారిపోయింది. జానకి అక్కయ్య కూతురు జ్యోతి సన్నగా ఏడుస్తోంది, ప్రక్కగదిలో నుండి.

జవానును వెంటనే డాక రును తీసికొనిరమ్మని పంపాను. ఆ మైకంలో వున్నంతసేపు, ఎటో శూన్యంలోకి తీవ్రంగా కన్నార్పకుండా చూస్తున్నట్లు కన్పించింది. ఆ చూపులో జీవం లేదు. మరణంతో పోట్లాడుతున్న జాడలు విశృబ్దంగా కన్పించాయి. ఎంతతో ముంచుకొచ్చింది! నాలుగు రోజులక్రితం, బజారులో కన్పించి 'కులాసానా మురారీ' అని ప్రశ్నించిన జానకి అక్కయ్యేనా ఈమె?

డాక్టరు వచ్చారు.

క్లుప్తంగా చెప్పాను. పరీక్షచేసి ఏదో ఇన్‌జెక్షన్ యిచ్చి, రేపుప్రొద్దున మరోమారుచూస్తాను' అంటూ వెళ్లిపోయా రాయన. డాక్టరు వెళ్లిన మరో 10 నిమిషాలకు స్పృహలోకి వచ్చింది.

'నయమవుతుంది. ఏమీ ఆదుర్దాలేదు అని చెప్పారు డాక్టరు' అని చెప్పాను.

పొడిగా నవ్వింది.

అది నవ్వుకాదు. దానిలో నవ్వులేదు. ఏదో నిరాశ, నిస్పృహ వేదన ధ్వనించాయి ఆ నవ్వులో. ''మురరీ—ప్రొద్దున వానలేదు. సాయంత్రాని కల్లా ముంచుకొచ్చినట్లు వర్షించింది కదూ—?'' అంది.

''అవును'' అన్నాను.

''అలాంటిదే ప్రాణం పోకడానూ!'' అంది. ''నీవుఅనవసరంగామనసు పాడుచేసుకోకు. విశ్రాంతి

తీసుకో'' అని చెప్పి జవాను తెచ్చిన కారియర్ భోజనం, తనకూ, నాకూ, వడ్డించమని చెప్పాను, జ్యోతితో; "అది మూడు రోజులుగా భోజనం ముట్టలేదు' అని చెప్పింది జానకి అక్కయ్య. బలవంతంచేసి జ్యోతి చేతి భోజనం చేయించాను.

రాత్రి 11 గంటలయింది. జానకి అక్కయ్యకు నిద్రపట్టినట్లుంది. ఏదో పుస్తకం, జానకి అక్కయ్య పుస్తకాలనుండితీసి, ఆమె మంచం ప్రక్కనే, పడక కుర్చీ వేసుకుని, విప్పాను.

భగవద్గీత.

"పాడిగా నవ్వింది—"

అక్కయ్య నిద్రపోలేదన్నమాట—

ఎందుకు నవ్వావన్నాను.

"యువకుడివి, ఇంజనీరువి, నీకు 'గీత' ఎందుకు నాయనా!" అంది. సమాధానం చెప్ప కుండానే, పుస్తకంలో మునిగిపోయాను. ఆమె కనులు మూసుకొని పడుకొంది. పుస్తకంలో పేజీలు త్రిప్పుతుండగా, పాతఫోటో ఒకటి జారి క్రిందబడింది. తీసి చూచాను.

"జానకి—రంగడు"

అవును జానకి అక్కయ్య—రంగడు బావ

జానకి అక్కయ్యకు—రంగడు బావకు పెళ్లి జరిగిపోయింది—ఎంతో వైభవంగా. ఎన్నో పిండి వంటలు చేశారు. ఊర బంతులు పెట్టారు. కాని ఎంత ప్రయత్నించినా అమ్మ నన్ను లడ్లు తిననివ్వలేదు—కాదు 'నీ శరీరం మంచిది కాదు నాయనా' అంటూ. నాచూపు, ప్రాణం అంతా లడ్లమీదే వుండిపోయింది.

ఆ మరునాటి సాయంత్రం మా పెద్దనాన్న గారి పెద్ద గది ముందు ఆడవాళ్ళ మూగారు. పాటలు పాడారు. జానకి అక్కయ్యకు పెద్దజడవేసి పూలు పెట్టారు. ఏదో నవ్వుకొంటున్నారు వాళ్లలో వాళ్లు. కాని నా మనసంతా ఆ గదిలోని లడ్లమీదే వుంది.

అంతలోనే సావిత్రి పిన్ని నన్ను పిలిచి 'ఒక పనిచేస్తావా! లడ్లు పెడతాను' అంది.


నా ప్రాణం లేచివచ్చింది—"ఓ" అన్నాను. "అయితే రా!" అంటూ నన్ను తీసుకొని వెళ్లి, ఎవరూ చూడకుండా, పెద్ద గదిలో మంచం క్రింద కూర్చుండబెట్టి ఒక లడ్డు యిచ్చి కదల కుండా ఈ రాత్రంతా ఇక్కడే వుండు రేపు ప్రొద్దున మరో లడ్డు యిస్తాను అంది. "సరే! అన్నాను. పిన్ని తనలో తాను నవ్వుకొని వెళ్లిపో యింది. నా కంతా అయోమయంగా వుంది. అయినా లడ్డు ఆశన వుండిపోయాను.

కొంచెంసేపయాక, జానకి అక్కయ్య రంగడు బావను గదిలో వదిలివేసి, అంతా ఎవరివారు వెళ్లిపోయారు. మంచంక్రిందంతా చీకటిగావుంది. పైగా భయంవేస్తోంది. తొంగిచూస్తుంటే పళ్లెంలో లడ్లు కనిపిస్తున్నాయి. ఆ పైన అద్దం కన్పిస్తోంది. ఆ అద్దంలో జానకి అక్కయ్య జడ లాగుతున్న రంగడు బావ కన్పించాడు.

"పాపం! నొప్పికదూ?"

అప్రయత్నంగా 'ఆయ్' అన్నాను.

జానకి అక్కయ్య, బావ ఉలిక్కిపడ్డారు. ఆ



తరువాత మంచం క్రింద వున్న నన్ను బయటకు తీసి ముద్దెట్టుకుంది జానకి అక్కయ్య. సావిత్రి పిన్ని....లడ్డు. ...అంతా చెప్పాను. మరో మారు ముద్దెటుకొని, అక్కడ వున్న రెండు లడ్లు యిచ్చి, తలుపుతీసి పంపేసింది. బయట నిలు చొని వున్న వారంతా నన్నుచూచి నవ్వారు.

వారంతా ఎందుకు నవ్వారో నాకు తెలియ లేదు. తెల్లవారాక, సావిత్రిపిన్ని వచ్చి రంగడు బావ తెల్లవారేసరికి ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పింది. పెదనాన్నగారింటి దగ్గర గుంపులు గుంపులు చేరారు. పెద గదిలో జానకి అక్కయ్య ఏడుస్తూంది చిన్నగా.

# "సాక్ష్యం"

సాయంత్రానికల్లా, భుజంగరావు పెదనాన్న, రామకోటి అన్నయ్య తిరిగి వచ్చారు, రంగడు బావ కన్పించలేదని. ఆ రోజే మునసబుగా రమ్మాయి, 'సరోజ' కన్పించలేదని అనుకొన్నారు.

రోజులు దొర్లిపోయాయి. మా పెరటిలోని మల్లె పూవులు పూసింది. పూయటం మానివేసింది; ఆకులూ రాలిపోయాయి... రంగడుబావ తిరిగి రాలేదు.తిరిగి రాడని కూడా నిర్ణయించారు. జానకి అక్కయ్య అంటే ఎంతో గారాబంగా చూచేవారంతా ఎందుకో అసహ్యించుకొనేవారు. జానకి అక్కయ్య ఎవరింటికీ వచ్చేది కాదు.

* * *

లోకం, సంఘం, చివరకు తనవారు కూడ తనను 'వెలితిగా' చూడటం సహించలేక, జానకి అక్కయ్య పసికందుతో మా వూరినుండి వెళ్లిపోయింది శాశ్వతంగా; ఎక్కడో వంటలుచేసుకొని బ్రతుకుతున్నదని చెప్పుకొనేవారు.

కాల భ్రమణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సంఘటనలన్నీ పాతపడిపోయాయి. నేను ఇంజనీరింగ్ పూర్తి చేశాను. పెదనాన్న పోయారు. రామకోటి అన్నయ్య ఆ యింటి పెద్ద అయ్యాడు.

ఓసారి ఇంజనీరింగ్ చదువుతుండగా సెలవులకు మా వూరు వెళ్లాను. రోజా ఏమీ తోచనప్పుడు, పోస్టాఫీసుకు వెళ్లేవాడిని. పోస్టు మాస్టరు రామానుజంగారు, జానకి అక్కయ్య ప్రసక్తి తీసుకువచ్చి 'ఏదో' అన్నారు. నేను వాదించాను 'ఆమె నిష్కల్మష' అని.

"అవును భర్త శోభనం రోజే వెళ్లిపోయాడు—కాని జానకమ్మ గర్భవతి అయింది. లోకం కన్ను మూయటానికైతే జానకమ్మ నిష్కల్మషే" అన్నా రాయన.

చాల బాధపడ్డాను.

ఆ నాడు మొదలుకొని ఏనాడూ, ఆ విషయంనే నెవరితోనూ ముచ్చటించలేదు. ఆదరించే తల్లితండ్రులు గతించారు జానకి అక్కయ్యకు. వదినగారి పెత్తనంలో, ఆమె నిలువ నీడలేక వెళ్లిపోయింది. తప్పేముంది?

ఈ 18 సంవత్సరాల కాలంలోను జానకి అక్కయ్య ఎక్కడ ఉందో, ఎలా జీవితాన్ని గడిపి వేసిందో...!

జూనియర్ ఇంజనీరుగా 'కుప్పం'లో వేశారు. ఒక్కణ్నే హోటలు తిండితో వుంటున్నాను. ఒకనాడు వూరి చివర హరిజనవాడలోని పాఠశాలకు రోడ్డు వేయించాల్సి వచ్చింది—తనిఖీ నిమిత్తం వెళ్లాను. జానకి అక్కయ్య కన్పించింది.

ఆశ్చర్య పోయాను.

ఆమెలో ఎంతో మార్పు కానవచ్చింది. కాలం సంఘం విసిరిన రాళ్లు ఆమె నెంతో కుదించివేసినట్లు, ఆమె వదనంలో ఎంతో దీనత కన్పించింది. తనను వెలివేసిన సంఘానికి, తలఒగ్గినట్లు, ఆమెలో "ఏదో" అణగారినతనం గోచరించింది—ఆమెలో మార్పు కేవలం వయస్సు తెచ్చిన మార్పేకాదు.

నేను చెప్పేవరకు గుర్తించింది కాదు!

గుర్తించాక, చాల సంతోషించింది. నేను ఇంజనీరు నయ్యానని గర్వించింది. ప్రయివేటుగా 8వ తరగతి పాసై, ఆతరువాత, ట్రైనింగ్ పాసయిందట. ఈ హరిజనవాడలోని పాఠశాలలో ఉపాధ్యాయినిగా వుంటోంది.

"మురారీ! ఈ బ్రతుకు భారాన్ని వద్దనుకున్నా మోయవలసిందేగా! భగవంతుడు, ఈ బాంధవ్య భారాన్ని కూడ అంటగట్టాడు. తప్పేదేముంది నాయనా!" అంది తన కూతురు జ్యోతి నుద్దేశించి మాట్లాడుతూ.

ఆ దగ్గరలోనే ఓ పూరి గుడిసెలో కాపురం వుంటోంది. జ్యోతి మెట్రిక్యులేషను పరీక్ష వ్రాసిందట.

"ఒకసారి నా గదికి రమ్మని" పిలిచాను—

"ఇప్పుడు గాదులే నాయనా! మరోమారు" అంది. ఆనాటి నుండి, అప్పుడప్పుడు జానకి అక్కయ్య దగ్గరకు వెళ్లి వస్తూ వుండేవాడిని. ఆప్యాయంగా పలుకరిస్తూ వుండేది.

"లోకం పలు కాకిమూక—" అనిపించేది ఆమెను చూస్తుంటే.

* * *

స్మృతిపథంనుండి వెనుకకు తేరుకునేపాటికి మినుకు మినుకు మంటున్న దీపం ఆరిపోతున్నట్లనిపించింది. దానిలో కిరోసిన్ పోదామనిలేచాను.

"మురారీ" అంది జానకి అక్కయ్య.

"ఏం" అన్నాను.

"ఆరిపోయేదాన్ని, రాలిపోయేదాన్ని ఎన్నాళ్లని నిలుపగలవు బాబూ..." అంది—ఆ క్షీణించిన వెలుగులో, జానకి అక్కయ్యను చూడటానికి ప్రయత్నించాను. సరిగా చూడలేకపోయాను. ఆమెను సరిగా చూచి, అర్థం చేసుకోగల్గినశక్తి ఎవరికి ఉంది కనక, నేను చూడగల్గుతాను?

"మురారీ....ఈ జీవితం రాలిపోతుందని, ఈ బ్రతుకు ఆరిపోతుందని నే నేనాడూ విచారించను. అంతటి ఆవశ్యకతా నాకు కన్పించదు. ఏమంత మహోదాత్తంగా వెల్గిందని ఈ జీవితాన్ని వదల్లేని ఆశ నన్ను చుట్టు ముట్టుతుంది"—పొడిగా నవ్వింది.



"కాని ఒక్కటే బాబూ! నా ఛాయగా నిల్చిన ఈ జ్యోతి ఏం కావాలి? అదే బాధ నన్ను వేధిస్తోంది.చుటూ కమ్ముకున్న రాబందుల బారి నుండి, ఆ జ్యోతి ఎలా మనగలుగుతుంది. ఇన్నాళ్లు ఏ గాలివాటుకూ ఎరకాకుండజ్యోతిని కాపాడాను."

ఆమె గొంతుక బొంగురుపోయింది.

"ఈ ప్రపంచంలో బ్రతికి బట కట్టడానికి కావలసిన ధనం, ఈ సంఘం ఆశించే గౌరవం, హోదా, ఆశ్రయం.... ఏమున్నాయి కనక దానికి—? చివరికి దాని జన్మ నిష్కల్మషమైనదని నిరూపించే, ధైర్యం, శక్తి—సాక్ష్యం అన్నీ కరువే...." జానకి అక్కయ్య కనుకొలుకులనుండి స్రవిస్తున్న కన్నీటి స్రవంతి ఆ చీకటిలో కూడ కన్పించింది నాకు.

"అనవసరంగా మనసు బాధ పెట్టుకోకు—నీకు నయమవుతుంది—" అన్నాను.

మినుకు మినుకు మంటున్న దీపకాంతిక్షీణించి క్షీణించి గతించిపోయింది. దూరంగా నక్కలు కూశాయి.

* * *

తెల్లవారే సరికి జానకి అక్కయ్య జీవితం తెల్లవారిపోయింది. ఆ హీనపుణ్య ప్రాపంచిక సుఖ దుఃఖాలకు అతీతంగా దాటిపోయింది.

ఆ నాటి సాయంత్రానికల్లా మిగిలిపోయిన ఆమె శరీరాన్ని అగ్నికి ఆహుతి చేయించి, ఆమెకుగా మిగిలిపోయిన స్మృతులను, జ్ఞాపకాలను మాత్రమే మిగిల్చాను.

జానకి అక్కయ్య సోదరుడు, రామకోటికి యిచ్చిన టెలిగ్రాంకు జవాబు రాలేదు—రాదని తెలిసే, బాధ్యత అనే నియమాన్ని పాటించాను. ఆయన 'సంఘం' గీచిన 'గిరి' దాటిరాలేకపోయారు.

ఆ నాటి రాత్రి జానకి అక్కయ్య పండుకొన్న మంచం ప్రక్కనే దీపకాంతిలో భగవద్గీత తీశాను.

జానకి అక్కయ్యే కన్పించింది.

"నాయనా! మురారీ! ఈ సంఘంలో బ్రతికి బట్టకట్టటానికి జ్యోతికి కావలసినధనం, ఈ సంఘం ఆశించే గౌరవం, హోదా—ఏమున్నాయి కనక, నా జ్యోతి మన గల్గుతుంది? చివరికి దాని జన్మ నిష్కల్మషమైందని నిరూపించే ధైర్యం, శక్తి, సాక్ష్యం— అన్నీ కరువే" అని అన్నట్లనిపించింది.

క్షణకాలం ఆలోచనా తపస్సులో మునిగి పోయాను. అవును.... "జ్యోతి" జన్మ నిష్కల్మషమైందని నిరూపించే సాక్షి నా కన్నా ఎవరు—?

"కాని ఈ సాక్షిని నమ్మేదెవరు?—"

"ఇంకెవరున్నారు—? నీవే" అని ధ్వనించింది. తిరిగి చూచాను. ఎవరూ లేరు—ఈ ధ్వని గాలి నుండి పుట్టింది.

గదిలో సన్నగా జ్యోతి ఏడుపు వినిపిస్తోంది.

* * *

జ్యోతిని నా భార్యగా స్వీకరింప దలచాను. ★